క్లుప్తంగా

ఐఓసీ భవన నిర్మాణ పనుల పరిశీలన



ఐఓసీ భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

దుబ్బాక టౌన్: సమీకృత భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం దుబ్బాకలో నిర్మిస్తున్న ఐఓసీ భవనం పనులను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి పరిశీ లించారు. త్వరలో ప్రారంభోత్సవం ఉంటుందని త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. రూ.17 కోట్ల వ్యయంతో నాలుగు ఎకరాల్లో ఐఓసీ భవనం నిర్మిస్తున్నారు. అదనపు కలెక్టర్ సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

వైకుంఠధామాన్ని సిద్ధం చేయండి
అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దుబ్బాక: పట్టణంలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న వైకుంఠధామం, రూ.74 లక్షలతో నిర్మిస్తున్న మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం పనులను వారంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మున్సిపల్ కమిషనర్ గణేశ్ రెడ్డిని ఆదేశించారు. మంగళవారం పట్టణంలో రేపల్లెవాడలోగల వైకుంఠధామాన్ని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలోగల మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కస్తూరిపల్లిలో సీఎం, మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లి గ్రామంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.28 కోట్లు మంజూరు చేసినందుకు మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. చెక్ డ్యామ్ నిర్మాణంతో గ్రామ రైతులకు మేలు జరుగుతుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని సర్పంచ్ పద్మ స్వామి పేర్కొన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి హరీశ్‌రావుకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మంగళగౌరీ వ్రతాలు



సిద్దిపేటలో శ్రీ గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణ మంగళవారం పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో మంగళగౌరీవ్రతాలు మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నీలకంఠ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో సామూహిక కుంకుమార్చన, మంగళ గౌరీ వ్రతాలు చేశారు.

పదింతలు ఇస్తానంటూ మోసం

రాయపోలు(దుబ్బాక): అత్యాశకు పోయి బాధితులు సొమ్ము పోగొట్టుకున్నారు. మండలంలోని బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శిలాశంకర్ గజ్వేల్‌లో ఈ ఏడాది జనవరిలో 'శామీర్‌పేట నిధి' సంస్థను ఏర్పాటు చేశాడు. 45 రోజులలో పదింతల డబ్బును చెల్లిస్తానంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీంతో బేగంపేటకు చెందిన పిట్ల కృష్ణ ఏప్రిల్ 24న రూ.50వేలు, మరో మహిళ రూ.30 వేలు చెల్లించారు. 45 రోజుల తర్వాత రూ.5 లక్షలు చెల్లిస్తానన్న శిలాశంకర్‌ను డబ్బు ఇవ్వాలని కృష్ణ కోరాడు. ఇప్పుడు లేవని, డబ్బులు వచ్చాక ఇస్తానని మాట దాటవేస్తుండటంతో మంగళవారం బేగంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే తొగుట సీఐ 8712667342, బేగంపేట ఎస్‌ఐ 8712667337లను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థులు రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సామాజిక కార్యక్రమాలతో సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థినులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



కోహెడలో హెచ్‌ఎం రాయిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



చేర్యాల(సిద్దిపేట): భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి



సిద్దిపేట ఎడ్యుకేషన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈఓ, ప్రిన్సిపాల్, అధ్యాపకులను సన్మానించిన విద్యార్థులు



మద్దూరు(హుస్నాబాద్): వల్లంపట్లలో ఉపాధ్యాయులను సన్మానించిన ఏసీపీ నారాయణ



గజ్వేల్ రూరల్: సింగాటంలో ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు



చిన్నకోడూరు(సిద్దిపేట): గోనెపల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

కొత్త ఇంటిలో కొత్త జీవితం ప్రారంభించండి

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్లు పొందిన లబ్ధిదారులు కొత్త ఇంటిలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 260 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సకల సౌకర్యాలతో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించిందన్నారు. ఇల్లు ఇస్తానని మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద 3 వేల ఇళ్లు మంజూరయ్యాయని, త్వరలో మరో 3 వేలు మంజూరు కాబోతున్నట్లు తెలిపారు. సొంత స్థలం లేని కుటుంబానికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఆర్డీఓ బెన్ షాలెమ్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

బీఆర్ఎస్‌దే భవిష్యత్

హుస్నాబాద్: భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని, దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయనుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బీఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బుధవారం హుస్నాబాద్‌లో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నట్లు ప్రకటించారు.

వీధి వ్యాపారులు ఆర్థిక పురోగతి సాధించాలి

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ రాంరెడ్డి

హుస్నాబాద్: బ్యాంక్ రుణం తీసుకున్న వీధి వ్యాపారులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ రాంరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి స్వనిధి సే సమృద్ధి క్యాంప్ నిర్వహించి రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ రాంరెడ్డి మాట్లాడుతూ రుణం తీసుకున్న స్ట్రీట్ వెండర్స్ క్రమం తప్పకుండా వాయిదాలు తిరిగి చెల్లిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఆన్‌లైన్ లావాదేవీలు జరుపుకోవాలన్నారు సూచించారు.



బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్యక్రమంలో మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ రాజు, ఆర్పీలు శ్రీలత, శోభ, అరుణ, పరమేశ్వరి, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గజ్వేల్‌రూరల్: తమను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష అభియాన్ పథకం ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిద్దిపేటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. దీక్ష అనంతరం గజ్వేల్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు, సీసీవో, ఐఈఆర్పీలు, పీటీఐలు, మెసెంజర్‌లు పని చేస్తూ విద్యారంగ బలోపేతానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నామన్నారు.

సిద్దిపేటరూరల్: తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 5 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడారు. 15 ఏళ్లుగా విద్యాశాఖ సమగ్రశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చాలీచాలనీ జీతాలతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 11వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని రోడ్డుపై వేశారు.



సిద్దిపేటలో జరిగిన రిలే దీక్షలో పాల్గొన్న గజ్వేల్ మండల సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది

ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలోమ్

హుస్నాబాద్‌రూరల్: యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ బెన్ షాలోమ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా నూతన ఓటరు నమోదుపై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీస్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ సూచించారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా ప్రకటించిందని, ఇందులో తప్పొప్పులుంటే ఫారం 8 ద్వారా సవరణ చేసుకునే అవకాశముందన్నారు. సందేహాలుంటే ఎన్నికల కమిషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1950లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి, కో ఇన్‌చార్జి బొజ్జ సైదులు, మైసా రాములు ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొడకండ్ల గ్రామానికి చెందిన ముంద్రాతి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధిగా ముక్కపల్లి రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్‌లు సాధిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని జిల్లాలో ఉధృతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.



ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

ఎమ్మార్పీఎస్ నాయకత్వానికి కృతజ్ఞతలు

గజ్వేల్‌రూరల్: జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడంపై ముంద్రాతి కృష్ణమాదిగ మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

దౌల్తాబాద్(దుబ్బాక): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నాగరాజుకు ఆశావర్కర్లు వినతి పత్రం అందజేశారు. కనీసం వేతనం రూ.18 వేలతోపాటు 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల పీఆర్సీ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పీహెచ్‌సీ డాక్టర్లు అమీనా సుల్తానా, సింధూజకు వినతి పత్రాన్ని ఆశా వర్కర్లతో కలిసి అందజేశారు.

సిద్దిపేటరూరల్: ఆశావర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన టీఆర్ఎస్‌కేవీ కి చెందిన ఆశాలు సీఐటీయూలో చేరారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 11వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లాలోని ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



దౌల్తాబాద్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

నిత్యాన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలి

కొముురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో గౌడ నిత్యాన్నదాన సత్రం కోసం కేటాయించిన స్థలం తమకే కేటాయించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మండల గౌడ సంఘం నాయకులు వినతి పత్రం అందిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వేనంబర్ 223/11లో 10 గుంటల భూమి గౌడ నిత్యాన్నదాన సత్రానికి గతంలో అధికారులు కేటాయించారన్నారు. రూ 2 లక్షల వ్యయంతో బోరు బావితవ్వించామని, ఇప్పుడు తమకు కాదని వేరే కులస్తులకు కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం నాయకులు ముత్యం నర్సింహులుగౌడ్, బుడిగే గురవయ్యగౌడ్, తాళ్లపల్లి రాజు, ముత్యం విజయ్ కుమార్, బుడిగే రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ అవినీతిపై విచారణ చేపట్టాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున ఆలయ చైర్మన్ అవినీతిపై విచారణ చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆలయంలో వివిధ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వద్ద కమీషన్లు తీసుకుంటున్నాడని ఆరోపించారు. పనుల్లో నాణ్యత లేదని, ఇటీవల నిర్మించిన ప్రసాదాల విక్రయశాలకు పగుళ్లు రావడమే అందుకు నిదర్శనమన్నారు. అవినీతిపై విజిలెన్సు అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగా కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, మేకల కృపాకర్, తాడూరి మల్లేశం, నీల భిక్షపతి, సార్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ముత్తిరెడ్డికి టికెట్ ఇవ్వాలి**

చేర్యాల(సిద్దిపేట): జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి మూడోసారి టికెట్ రావాలని కోరుతూ ఆ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు మీస పార్వతి సత్యనారాయణ మంగళవారం పట్టణంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ముడుపు కట్టి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2009 నుంచి జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. ముత్తిరెడ్డికి టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

◆ **ఆరోగ్య సిద్దిపేటలో భాగస్వామ్యం కావాలి**

సిద్దిపేటజోన్: ఆరోగ్య సిద్దిపేట లక్ష్యసాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో రుతుప్రేమ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు శ్రీకారం చుట్టారన్నారు. సమావేశంలో మెప్మా అధికారులు హన్మంతరెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ **వృద్ధురాలిని ఆదుకోవాలి**

గజ్వేల్‌రూరల్: వృద్ధురాలు మస్కూరి బుచ్చమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని బీజేపీ, డీబీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం 9వ వార్డులో పూరిగుడిసెలో నివసిస్తున్న ఆమెను వేర్వేరుగా పరామర్శించారు. త్వరలో ఇల్లు నిర్మించి బుచ్చెమ్మతో గృహప్రవేశం చేయిస్తానని బీజేపీ నాయకుడు నాయకుడు నందన్‌గౌడ్ భరోసా ఇవ్వగా, గృహలక్ష్మీ పథకాన్ని వర్తింపజేయాలని డీబీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి, డీబీఎఫ్ నాయకుడు వేణు తదితరులు ఉన్నారు.

◆ **కౌన్సెలింగ్‌కు 400 మంది హాజరు**

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్‌కు బుధవారం 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బీ ఫార్మసీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరే విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తియ్యిందన్నారు. ఐడీ, పాస్‌వర్డు పొందిన విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.

◆ **నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డు**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లి, దర్గపల్లి గ్రామాల మధ్యలోని వాగుపై వంతెన నిర్మిస్తున్నారు. ఇక్కడ తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రమాదాలు జరగకుండా సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి చర్యలు చేపట్టారు.

◆ **సర్పంచ్‌పై ఉపసర్పంచ్ ఆరోపణలు**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని సూరంపల్లిలో డ్రైనేజీ నిర్మించి ఏడాది గడుస్తున్నా సర్పంచ్ బిల్లులు చెల్లించడంలేదని ఉపసర్పంచ్ స్వామి ఆరోపించారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. డ్రైనేజీ నిర్మించి ఏడాది గడిచిందని, బిల్లులు చెల్లించాలని అడిగినందుకు తనపై సర్పంచ్ అయాంగారి నర్సింహులు కక్షకట్టి ఎనిమిది మంది వార్డు సభ్యులతో అవిశ్వాస తీర్మానం పెట్టాడని ఆరోపించాడు. సోమవారం హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నట్లు చెప్పాడు.

◆ **మహాసభలు వాయిదా**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలు వాయిదాపడ్డాయని, త్వరలో మళ్లీ నిర్వస్తామని జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు.

◆ **గజ్వేల్ నుంచే కేసీఆర్ పోటీ చేయాలి**

వర్గల్(గజ్వేల్): అన్నిరంగాలలో గజ్వేల్ నియోజకవర్గాన్ని దేశంలోనే గర్వించేస్థాయిలో తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ మళ్లీ గజ్వేల్ నుంచే పోటీచేయాలని వర్గల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం వర్గల్‌లో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడోసారి కేసీఆర్‌ను గెలిపించేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారన్నారు.

◆ **అక్రమ కట్టడాల కూల్చివేత**

కొండపాక(గజ్వేల్): మండలంలోని రవీంద్రనగర్ గ్రామ పంచాయతీ పరిధి విశ్వనాథపల్లిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. విశ్వనాథపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఇతర అవసరాల కోసం కేటాయించారు. ఇందులో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో స్థానికులు ప్రజావాణి, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఆర్ఐ బాలకృష్ణ, ఎంపీడీఓ రాందరెడ్డి, ఎంపీఓ వీరరాజులు కూల్చి వేతలను పర్యవేక్షించారు.

◆ **కాడెద్దు మృతి**

దౌల్తాబాద్(దుబ్బాక): పశువుల కొట్టంలో కట్టేసిన కాడెద్దు మృతి చెందింది. మండల పరిధిలోని ముత్యంపేట గ్రామస్తులు, రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యంపేటకు చెందిన జెర్ర రాజయ్య రాజుమాదిరిగానే సోమవారం రాత్రి తన పొలంలో ఉన్న పశువుల పాకలో రెండు కాడెద్దులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా ఒక కాడెద్దు మృతి చెంది కనిపించింది. ఎద్దు మృతిపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

◆ **నేడు సర్వసభ్య సమావేశం**

మద్దూరు(హుస్నాబాద్): ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు.